TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 76 | పేజీలు : 04| వెల: రూ.3/-   తెలంగాణ   మంగళవారం | జూన్ 30, 2026

# కాంగ్రెస్ నిర్వహించేది ఆశీర్వాద సభ కాదు

- ముమ్మాటికీ 'రైతు వంచన' సభే
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు
- సీఎం రేవంత్ తీరు పాలమూరు పరువు తీసేలా ఉంది
- జడ్చర్ల బీఆర్ఎస్ సభలో మాజీ మంత్రి ధ్వజం
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.29,300 కోట్లు బాకీ పడింది


2లో..

**మహబూబ్‌నగర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అడుగడుగునా రైతాంగాన్ని మోసం చేస్తూనే ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తన, ఆయన మాట్లాడే భాష పాలమూరు జిల్లా పరువు తీసేలా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ నిర్వహిస్తున్నది ఆశీర్వాద సభ కాదని, అది ముమ్మాటికీ 'రైతు వంచన సభే'నని దుయ్యబట్టారు. జడ్చర్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గతంలో వివిధ సమయాల్లో రేవంత్ రెడ్డి మాట్లాడిన వీడియో క్లిప్పింగులను సభలో ప్రదర్శించిన హరీష్ రావు.. సీఎం అనుచిత వ్యాఖ్యల వల్ల ముఖ్యమంత్రి కుర్చీ విలువ పూర్తిగా దిగజారిపోయిందని ఎద్దేవా చేశారు.



2లో..

# కేసీఆర్ పాలనలో అప్పుల ఊబి..

- కాంగ్రెస్ హయాంలో రైతుకు సంక్షేమ పండుగ
- సీఎం రేవంత్ రెడ్డి
- 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా జమ..
- నగదు సిద్ధం చేశాం
- బీఆర్ఎస్, బీజేపీలపై ముఖ్యమంత్రి నిప్పులు..
- అభివృద్ధిపై అసెంబ్లీ వేదికగా చర్చకు సవాల్!

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గత 30 నెలల్లో రైతాంగాన్ని ఆత్మగౌరవంతో బతికించేందుకు, వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు సంపూర్ణంగా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల నుంచి వీక్షిస్తున్న రైతు సోదరులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, అక్రమాలను ఎండగడుతూనే, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమాన్ని సీఎం వివరించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు కేవలం రూ.69 వేల కోట్ల అప్పు మాత్రమే ఉండేదని, కానీ గత పదేళ్ల కల్వకుంట్ల పాలనలో రాష్ట్రాన్ని రూ.8.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేశారని సీఎం మండిపడ్డారు. "60 ఏళ్ల ఉమ్మడి పాలనలో పాలకులంతా కలిసి రూ.69 వేల కోట్లు అప్పు చేస్తే.. కేవలం ఒకే ఒక్క కుటుంబం రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి, రాష్ట్రం మళ్లీ లేవకుండా మన్ను కప్పింది" అని ధ్వజమెత్తారు. చివరకు ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, బడి పిల్లల బట్టలు, కూరగాయల బకాయిలతో పాటు సర్పంచ్‌లకు వందల కోట్లు బకాయిలు పెట్టి సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమయ్యారని ఆరోపించారు. "బకాయిలు పెట్టింది గత 'బకాసురులు'.. వాటిని కట్టే పని మాత్రం నాకు పడింది" అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వ 30 నెలల కాలంలో రైతుల కోసం ఖర్చు చేసిన వివరాలను గణాంకాలతో వెల్లడించారు. 25.35 లక్షల మంది రైతులకు రూ.20,000 కోట్ల రుణమాఫీ పూర్తి. రైతు భరోసాను రూ.12 వేలకు పెంచి, ఇప్పటివరకు రూ.27,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ. ఈ విడతతో కలిపి మొత్తం రూ.36,000 కోట్లు చెల్లింపు. రాబోయే 9 రోజుల్లోనే మరో రూ.9,000 కోట్లు విడుదల చేయడానికి నగదు సిద్ధం. ఉచిత కరెంట్ అనేది కాంగ్రెస్ పార్టీ పేటెంట్. దీని కోసం నెలకు రూ.1,000 కోట్ల చొప్పున ఇప్పటివరకు రూ.30,000 కోట్లు ఖర్చు చేశాం. సన్న వడ్ల బోనస్ కోసం రూ.4,000 కోట్లు, రైతు బీమా కోసం రూ.3,500 కోట్లు ఖర్చు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ.6,000 కోట్లు ఖర్చు పెడుతుంటే.. బీఆర్ఎస్ హయాంలో నెలకు కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టేవారని సీఎం తెలిపారు.

# కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ!

- రాష్ట్రంలో 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్లు..
- ఢిల్లీకి తరలుతున్న సొమ్ము
- బీజేపీ జాతీయ నేత నితిన్ నబీన్ ధ్వజం
- మల్కాజిగిరిలో ఘనంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు


2లో..

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం తన ఢిల్లీ దర్బార్‌కు ఒక ఏటీఎంలా మార్చేసిందని బీజేపీ జాతీయ నేత నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం మల్కాజిగిరి పరిధిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఘనంగా జరిగాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

# కేంద్రమంత్రి బండికి ఊరట

## హుజూరాబాద్ ఉప ఎన్నికల కేసు కొట్టివేత


2లో..

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఊరట లభించింది. ఈ కేసును విచారించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు బండి సంజయ్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా అప్పటి అధికార బీఆరఎస్ పార్టీ ఓటుకు రూ.25 వేల వరకు ఇస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. అలాగే ఓటర్లకు రూ.5 వేల చొప్పున ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని బీఆరఎస్ కార్యకర్తలు పంచుకుంటున్నారని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో హుజూరాబాద్ పోలీసులు బండి సంజయ్‌పై ఐపీసీ సెక్షన్లు 188, 171సీ, 505(2)తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం`1951లోని సెక్షన్ 123(3ఏ) కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కేసును విచారించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

# గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం


2లో..

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ధర్మపురిలో పుష్కర ఘాట్ల పరిశీలన..
- రూ.117 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు

## కేసీఆర్ పాలనలో అప్పుల ఊబి..

(మొదటి పేజీ తర్వాత..)

### కూలేశ్వరంగా మారిన కాళేశ్వరం!

రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు రెండేళ్లలోనే కూలిపోయి 'కూలేశ్వరం'గా మారిందని, ప్రజల సొమ్మంతా గోదావరిలో కలిసిపోయిందని సీఎం విమర్శించారు. కాళేశ్వరం నీళ్లతోనే పంటలు పండాయని అబద్ధాలు చెప్పారని, కానీ గత మూడేళ్లుగా కాళేశ్వరం నుండి చుక్క నీరు రాకపోయినా తెలంగాణ రైతులు తమ కష్టంతో 2.80 కోట్ల టన్నుల ధాన్యాన్ని పండించి రికార్డు సృష్టించారని కొనియాడారు. "కేసీఆర్ ఇకనైనా కాశీ మజిలీ కథలు ఆపాలి.. దమ్ముంటే పదేళ్లలో మీరు ఏం చేశారు? రెండున్నరేళ్లలో మేం ఏం చేశామనే దానిపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు రావాలి" అని సవాల్ విసిరారు.

### మహిళా సాధికారతే లక్ష్యం

ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వమే రూ.11,000 కోట్లు ఆర్టీసీకి చెల్లించి సంస్థను రూ.1,000 కోట్ల లాభాల్లోకి తెచ్చింది. మహిళా సంఘాలను 1,000 బస్సులకు యజమానులను చేయడంతో పాటు, వారి ద్వారా 1,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు, రిలయన్స్‌తో పోటీపడేలా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయిస్తున్నాం. గత ప్రభుత్వం ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.8,000 కోట్ల బకాయిలు పెడితే మేం వాటన్నింటినీ చెల్లిస్తూ, ప్రతి నెల 1వ తారీఖునే జీతాలు ఇస్తున్నాం. కేసీఆర్ తన ఇంట్లోనే ఉద్యోగాలు ఇచ్చుకుంటే.. మేం ఈ 30 నెలల్లోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. "మేం ఏం చేసినా.. చేయకపోయినా.. గత పాలకులలాగా భార్యాభర్తలు మాట్లాడుకునే వ్యక్తిగత ఫోన్ సంభాషణలను మాత్రం వినం. సొంత బిడ్డనే తన ఫోన్ విన్నారని చెప్పేలా వ్యవహరించిన ఆ బతుకు ఎందుకు? ఆ పాపాల భైరవుడిని అరుంధతి సినిమాలో రాక్షసుడిలా ఫామ్ హౌస్‌లో ప్రజలే బంధించారు" అని ఎద్దేవా చేశారు. శాస్త్రవేత్తల సూచనల ప్రకారం వ్యవసాయం: ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడతాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నందున, రైతులు కాలానికి తగ్గట్లుగా పంటలు మార్చుకోవాలని సీఎం సూచించారు. ఇందుకోసం 7 రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో అందుబాటులో ఉంచామని, మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్న వడ్లనే వేయాలని కోరారు. ప్రభుత్వం 5 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తుంటే వద్దంటున్నారని.. మూసీ పునరుజ్జీవనం, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల కోసం అన్ని పనులను చేసి తీరుతామని సీఎం స్పష్టం చేశారు.

## గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ధర్మపురిలో పుష్కర ఘాట్ల పరిశీలన..
- రూ.117 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు



**జగిత్యాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాబోయే గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, వైభవంగా నిర్వహిస్తుందని రాష్ట్ర ఎస్సీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా మంగళవారం ఆయన జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురిలో గోదావరి పుష్కర ఘాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారులతో కలిసి ఏర్పాట్లు, మౌలిక వసతులపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా తరలివచ్చే కోట్లాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి అవసరమైన అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే పుష్కరాలకు ఏడాది ముందే పనులను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. పుష్కరాల నిర్వహణ కోసం ధర్మపురి, కోటిలింగాల వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల పరిధిలో ఘాట్ల అభివృద్ధి, ఇతర అత్యవసర మౌలిక వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.117 కోట్ల నిధులను కేటాయించిందని మంత్రి తెలిపారు. ఈ నిధులతో చేపట్టబోయే



ప్రధాన పనులు భక్తులు సురక్షితంగా పుణ్యస్నానాలు ఆచరించేలా ఘాట్లను విస్తరించి, కొత్తగా రక్షణ గోడలు, మెట్లను నిర్మిస్తారు. క్షేత్రాలకు వచ్చే అన్ని ప్రధాన రహదారులను విస్తరించి, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సుగమం చేస్తారు. నిరంతర తాగునీటి సదుపాయం, అత్యాధునిక పారిశుధ్య వ్యవస్థలు, భక్తులు బస చేయడానికి వీలుగా ప్రత్యేక విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

### గత అనుభవాల దృష్ట్యా పక్కా ప్రణాళిక..

గత గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులు రద్దీ, రవాణా పరంగా ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు మరియు అత్యవసర రక్షణ వ్యవస్థలను ముందస్తుగానే బలోపేతం చేస్తామన్నారు. పుష్కరాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అనుభవం ఉన్న ప్రముఖ కన్సల్టెన్సీల సహకారంతో ఈ ఆధ్యాత్మిక మహోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఆదర్శవంతంగా నిలిచేలా నిర్వహిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నిర్వహించేది ఆశీర్వాద సభ కాదు

- ముమ్మాటికీ 'రైతు వంచన' సభే
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు
- సీఎం రేవంత్ తీరు పాలమూరు పరువు తీసేలా ఉంది
- జడ్చర్ల బీఆర్ఎస్ సభలో మాజీ మంత్రి ధ్వజం
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.29,300 కోట్లు బాకీ పడింది




**(మొదటి పేజీ తర్వాత..)** ఎన్నికల ముందు ఎకరానికి రూ.15,000 రైతు బంధు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు పెద్దపెద్ద హామీలు ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక దాన్ని రూ.12,000కు తగ్గించడమే కాకుండా.. అందులోనూ కోతలు పెట్టారని హరీష్ రావు ఆరోపించారు. ఒక పంట కాలానికి 3 ఎకరాల వరకే ఇచ్చి, ఇంకో పంట కాలానికి కేవలం 2 ఎకరాల వరకే పరిమితం చేసి రైతులను దారుణంగా దెబ్బతీశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్రకారం లెక్క తీస్తే.. ఈ ప్రభుత్వం రైతు బంధు పేరిట తెలంగాణ రైతాంగానికి ఇవాళ అక్షరాలా రూ.29,300 కోట్లు బాకీ పడిందని గణాంకాలతో వివరించారు. "జడ్చర్ల వేదికగా డిమాండ్ చేస్తున్నా.. నువ్వు పెట్టుకున్న ఈ వంచన సభలో ఈ రూ.29,300 కోట్ల బాకీ డబ్బులను ఎప్పటిలోపు రైతులకు తిరిగిస్తావో సమాధానం చెప్పాలి" అని సీఎం రేవంత్‌ను నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మార్క్ బోనస్ హామీలన్నీ బోగస్‌గా మారిపోయాయని హరీష్ రావు విమర్శించారు. మార్కెట్లలో తరుగు పేరుతో నిరుపేద రైతులను దారుణంగా దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు సకాలంలో యూరియా ఇవ్వడంలో కూడా ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. షాపుల్లో అసలు యూరియా స్టాక్ ఉంచడం లేదని, ఆ నిజాన్ని కప్పిపుచ్చుకోవడానికి యాప్‌లంటూ కొత్త కథలు మొదలుపెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. ఇదే క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు తీరుపై హరీష్ రావు చమత్కరించారు. జిల్లా మంత్రిగా ఉన్న జూపల్లి అసలు ఏం మాట్లాడుతాడో, ఎందుకు మాట్లాడుతాడో ఆయనకే అర్థం కాదంటూ ఎద్దేవా చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోవడంలో జిల్లా మంత్రులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారని, కాంగ్రెస్ మోసపూరిత పాలనపై రైతాంగం తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ఎలాంటి హామీలు ఇవ్వకపోయినా, ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి పనులు చేసేవారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ!

- రాష్ట్రంలో 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్లు..
- ఢిల్లీకి తరలుతున్న సొమ్ము
- బీజేపీ జాతీయ నేత నితిన్ నబీన్ ధ్వజం
- మల్కాజిగిరిలో ఘనంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు



(మొదటి పేజీ తర్వాత..) రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ మార్క్ అవినీతి, నేరాల తరహా పాలన సాగుతోందని ఆయన ఆరోపించారు. తెలంగాణలో అడ్డగోలుగా 'ఆర్ఆర్ ట్యాక్స్' (RR Tax) విధిస్తూ, ఇక్కడి నుంచి వసూలైన ప్రజల సొమ్మును మూటలు కట్టి నేరుగా ఢిల్లీకి తరలిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలంటూ మోసపూరిత హామీలు ఇచ్చిందని, అధికారం చేపట్టిన తర్వాత వాటిల్లో ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని దుయ్యబట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ వెంట నడిచేందుకు తెలంగాణ ప్రజలు పూర్తి ఉత్సాహంతో సిద్ధంగా ఉన్నారని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇచ్చిన ప్రతి హామీని పక్కాగా అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నామని గుర్తుచేశారు. గత 12 ఏళ్ల మోదీ పాలనలో దేశంలో ఎంతో పరివర్తన వచ్చిందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు పైకి వేర్వేరుగా నటిస్తున్నా.. లోపల మాత్రం మూడూ కలిసే ఉన్నాయని ఆరోపించారు. ఈ ముగ్గురి కుమ్మక్కు రాజకీయాల వల్ల రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. ఈ ప్రతిష్టాత్మక రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కేంద్ర మంత్రులు జీ. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌లతో పాటు బీజేపీకి చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర పదాధికారులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



వాయిస్ ఆఫ్ వందే భారత్ Voice of Vande Bharath

VOICE OF VANDE BHARATH

మంగళవారం, జూన్ 30, 2026

# ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటాం

- ఎన్నికల వాగ్దానాలన్నీ నెరవేరుస్తాం
- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- మైనారిటీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ముస్లిం మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ తూచా తప్పకుండా నెరవేరుస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో ఎమ్మెల్యే సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్ నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి, భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మస్జిద్ కమిటీ ప్రతినిధులు, ముస్లిం సంఘాల పెద్దలు ఎమ్మెల్యే వంశీకృష్ణను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ముస్లిం సోదరులకు ఇచ్చిన హామీల ప్రకారం వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతోందని తెలిపారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే మస్జిద్‌లు, దర్గాలు, ఈద్గాల శాశ్వత అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో చేపట్టిన మైనారిటీల సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని దర్గాల పునరుద్ధరణ, అభివృద్ధి కోసం త్వరలోనే ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. ఎక్కడైనా మస్జిద్ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉంటే, వాటిని పూర్తి చేయించే బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటానని ముస్లిం పెద్దలకు భరోసా ఇచ్చారు. ముస్లిం మైనారిటీల విద్యా, ఆర్థికాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక నూతన పథకాలను ప్రవేశపెడుతోందని వంశీకృష్ణ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని ఆయన కొనియాడారు. మస్జిద్ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మైనారిటీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉప్పునుంతల సీహెచ్‌సీకి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి

- సిబ్బంది లేక పేదలకు అందని వైద్యం..
- ఆసుపత్రిని సందర్శించిన సీపీఎం జిల్లా బృందం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఉప్పునుంతల మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తక్షణమే రెగ్యులర్ డాక్టర్‌ను, గైనకాలజిస్ట్‌ను నియమించాలని, ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం సీపీఎం జిల్లా బృందం ఆధ్వర్యంలో ఉప్పునుంతల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, అక్కడి వసతులు, సిబ్బంది కొరతపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపినట్లు సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని పరిశీలించిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్. దేశ్య నాయక్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో విలువైన వైద్య పరికరాలు ఉన్నప్పటికీ, వాటిని నడిపే టెక్నీషియన్లు లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే టెక్నీషియన్లను నియమించి ఎక్స్-రే, ఈసీజీ పరీక్షలను పేద ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోందని దేశ్య నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో మొత్తం 14 మంది స్టాఫ్ నర్సులు ఉండాల్సిన చోట కేవలం నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. రాత్రి సమయాల్లో డాక్టర్లు ఆసుపత్రిలో అందుబాటులో ఉండకపోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఆసుపత్రిలోనే స్థానికంగా ప్రసవాలు జరిగేలా శాశ్వత గైనకాలజిస్ట్‌ను నియమించాలి. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం దంత వైద్యుడి పోస్టును భర్తీ చేయాలి. ఆసుపత్రిలో ఉన్న ఎక్స్-రే, ఈసీజీ మిషన్లను అందుబాటులోకి తెచ్చి ఉచిత పరీక్షలు నిర్వహించాలి. కొరతగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేసి రాత్రి వేళల్లోనూ వైద్య సేవలు అందించాలి. ప్రజలకు సరైన వైద్యం అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని, ఆరోగ్యం అనేది ప్రజల ప్రాథమిక హక్కు అని సీపీఎం నేతలు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యా-వైద్య శాఖ అధికారులు స్పందించి ఉప్పునుంతల ఆసుపత్రి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.శంకర్ నాయక్, అచ్చంపేట మండల కార్యదర్శి సైదులు, సీపీఎం సీనియర్ నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు

- సమర్పించిన చైర్మన్ పుల్కం రాజు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి బోనాల మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని, పట్టణ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు, అధికారులను వేద ఆశీర్వచనాలతో దీవించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. వేములవాడ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారికి ప్రతి ఏటా మున్సిపాలిటీ తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ఆ జగన్మాత కటాక్షంతో వేములవాడ పట్టణం అన్ని రంగాల్లో మరింత ముందుకు వెళ్లాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు మున్సిపాలిటీ తరపున ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ మేనేజర్, స్థానిక కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు పూదరి మురళి గౌడ్, సంద్రగిరి ప్రవీణ్ గౌడ్, ముంజ రమేష్ గౌడ్, మహేష్ గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



**అచ్చంపేట, యిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు కనీస మౌలిక వసతులు కల్పించడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎండీ సయ్యద్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల క్షేత్రస్థాయి సర్వేలో భాగంగా మంగళవారం అచ్చంపేట పట్టణ కేంద్రంలోని జీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను వారు సందర్శించారు. క్లాస్ రూమ్‌లలోకి వెళ్లి విద్యార్థులతో నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. యూఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ నాయకులు శివ, మహేష్, అఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# హై రిస్క్ గర్భిణికి సిజేరియన్ సక్సెస్

- అచ్చంపేట కేర్ హాస్పిటల్ చికిత్స
- పునర్జన్మ నిచ్చిన డాక్టర్ ఆమ్రిన్.. తల్లి, బిడ్డ క్షేమం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక హై రిస్క్ గర్భిణికి అచ్చంపేట పట్టణంలోని కేర్ హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించి పునర్జన్మ నిచ్చారు. డాక్టర్ ఆమ్రిన్ నేతృత్వంలోని వైద్య బృందం సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లి, బిడ్డ ఇద్దరి ప్రాణాలను కాపాడారు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. బల్మూర్ మండలం పోలిశెట్టిపల్లి గ్రామానికి చెందిన వాస్కుల పూజిత అనే మహిళ గర్భం దాల్చిన మొదటి నెల నుంచి ఎనిమిదో నెల వరకు నాగర్‌కర్నూల్‌లోని 30 సంవత్సరాల అనుభవం కలిగిన ఒక ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రిలో క్రమం తప్పకుండా గర్భధారణ పరీక్షలు చేయించుకుంటూ వచ్చారు. అయితే ఎనిమిదో నెలలోకి ప్రవేశించగానే పూజితకు అకస్మాత్తుగా అధిక రక్తపోటు పెరగడంతో పాటు కంటి చూపు మసకబారడం వంటి ప్రమాదకరమైన లక్షణాలు కనిపించాయి. దీంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు వెంటనే నాగర్‌కర్నూల్‌లోని సదరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు, కేసు అత్యంత క్లిష్టంగా మారిందని భావించి, తమవల్ల కాదంటూ చేర్చుకోవడానికి నిరాకరించారు. తక్షణమే హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని గర్భిణిని రెఫర్ చేశారు. తీవ్ర ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులు చివరి ప్రయత్నంగా అచ్చంపేటలోని కేర్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆమ్రిన్‌ను సంప్రదించారు. పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉన్నప్పటికీ, డాక్టర్ ఆమ్రిన్ ధైర్యంగా కేసును స్వీకరించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా అత్యంత నైపుణ్యంతో శస్త్రచికిత్స నిర్వహించారు. వైద్యుల శ్రమ ఫలించి ఎలాంటి రిస్క్ లేకుండా ఆపరేషన్ విజయవంతమైంది. ప్రస్తుతం తల్లి, నవజాత శిశువు ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో క్షేమంగా ఉన్నారని డాక్టర్ ఆమ్రిన్ తెలిపారు. అత్యవసర సమయంలో తమకు అండగా నిలిచి ప్రాణాలు కాపాడిన డాక్టర్ ఆమ్రిన్‌కు, కేర్ హాస్పిటల్ సిబ్బందికి పూజిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# డీఈఓ జగన్మోహన్ రెడ్డి పదవీ విరమణ

**ఘనంగా సత్కరించిన కాంగ్రెస్ నేత మైలారం రాము**



**సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాశాఖ అధికారిగా సుదీర్ఘ సేవలు అందించి, నేడు పదవీ విరమణ పొందుతున్న జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర రజక సంఘం మాజీ కన్వీనర్, వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మైలారం రాము పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక గ్రామానికి చెందిన ఉన్నత విద్యావంతుడైన డీఈఓ జగన్మోహన్ రెడ్డిని మైలారం రాము మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం మైలారం రాము మాట్లాడుతూ.. జిల్లా విద్యాశాఖ అధికారిగా జిల్లా ప్రజలకు, విద్యాసంస్థల బలోపేతానికి జగన్మోహన్ రెడ్డి అందించిన విశిష్ట సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. విద్యా రంగంలో ఆయన చూపిన చొరవ, సాధించిన ప్రగతి ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జగన్మోహన్ రెడ్డి.. రాబోయే కాలంలో తన కుటుంబ సభ్యులతో కలిసి శేష జీవితాన్ని సంపూర్ణ ఆరోగ్యంతో గడపాలని ఆకాంక్షించారు.

# ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్ డిమాండ్
- ఎంఈఓకు ఏఐఎస్ఎఫ్ వినతిపత్రం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమాలపై వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అచ్చంపేట మండల విద్యాధికారికి ఏఐఎస్ఎఫ్ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ.. కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యను సేవగా కాకుండా పూర్తి వ్యాపారంగా మార్చేశాయని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు తదితర విద్యా సామగ్రిని తమ పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలంటూ తల్లిదండ్రులను బలవంతం చేస్తున్నాయని ఆరోపించారు. దీనివల్ల పేద, మధ్యతరగతి తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల నియంత్రణ వ్యవస్థలో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకొని కొన్ని కార్పొరేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆయన మండిపడ్డారు. అలాగే అచ్చంపేట పట్టణంలో ప్రభుత్వ అనుమతులు లేదా కనీస గుర్తింపు లేకుండా నడుస్తున్న పాఠశాలలను వెంటనే గుర్తించి, వాటిని సీజ్ చేయడంతో పాటు యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో విద్యాశాఖ తక్షణమే ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి. పాఠశాలల ప్రాంగణాల్లో సాగుతున్న పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలను వెంటనే నిలిపివేయాలి. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకొని విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలి. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మధు, రవి పాల్గొన్నారు.

# బాలుర జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలి

- శిథిలావస్థలో విద్యా నిలయం..
- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దేశ్యా నాయక్ డిమాండ్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు తక్షణమే నూతన భవనాన్ని నిర్మించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. దేశ్యా నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన కళాశాల భవనాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితులపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ్యా నాయక్ మాట్లాడుతూ.. అచ్చంపేట ప్రాంతంలో ఎంతో మందిని డాక్టర్లుగా, విద్యావేత్తలుగా, రాజకీయ నాయకులుగా, శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దిన ఘన చరిత్ర ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఉందన్నారు. అలాంటి విద్యా నిలయం నేడు పాలకుల నిర్లక్ష్యం వల్ల శిథిలావస్థకు చేరి కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రారంభించి దాదాపు 40 సంవత్సరాలు కావస్తుండటంతో భవనం పూర్తిగా దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కళాశాలలో సుమారు 120 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని దేశ్యా నాయక్ తెలిపారు. వర్షాకాలం వస్తే చాలు పైకప్పు నుండి నీరు కారుతోందని, సిమెంట్ పెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనల మధ్య క్లాసుల్లో కూర్చోవాల్సి వస్తోందని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి బాలుర కళాశాలకు నూతన భవనం మంజూరు చేయించడంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అచ్చంపేట మండలంలోని సుమారు 30 గ్రామాల నుండి పేద విద్యార్థులు ఇక్కడికి చదువుకోవడానికి వస్తున్నారని ఆయన గుర్తుచేశారు. దూర ప్రాంతాల నుండి వచ్చే వీరంతా మధ్యాహ్నం వేళ భోజన వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆలోచన చేసి, ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు శివకుమార్, శంకర్ నాయక్, వర్గం సైదులు, రమేష్, సురేష్, రవి పాల్గొన్నారు.

# వివాహాలు చేసుకున్న ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** వివాహాలు చేసుకున్న ప్రతి ఒక్కరు చట్టప్రకారం తమ వివాహాన్ని నమోదు చేసుకోవాలని లింగాల మండల పరిధిలోని రాంపూర్ పంచాయతీ కార్యదర్శి పాండు నాయక్ సూచించారు. మంగళవారం రాంపూర్ గ్రామంలో ఇటీవల వివాహం చేసుకున్న కోడెల అనిల్ కుమార్ యాదవ్ – నికిత దంపతులకు గ్రామ ఉపసర్పంచ్ గుర్రటి కృష్ణయ్య చేతుల మీదుగా వివాహ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పాండు నాయక్ మాట్లాడుతూ.. గ్రామంలో నూతనంగా పెళ్లి చేసుకున్న జంటలు తప్పనిసరిగా గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి మ్యారేజ్ రిజిస్టర్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు, ఇతర చట్టపరమైన అవసరాలకు వివాహ ధ్రువీకరణ పత్రం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ నిబంధనను పాటించి బాధ్యతగా నడుచుకోవాలని కోరారు. వార్డు సభ్యులు చుక్క బొట్ల కాసిం, గ్రామస్తులు శ్రీనివాస్ యాదవ్, నరేష్ యాదవ్, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అసోంలో భారీ ఆపరేషన్

**అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారం స్వాధీనం**

**గౌహతి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అస్సాం పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.55 కోట్లకు పైనే ఉంటుందని పోలీసులు వెల్లడించారు. బహుశా అస్సాం పోలీస్ చరిత్రలోనే ఇంతపెద్ద మొత్తంలో బంగారం సీజ్ చేసిన ఘటన ఇదే కావొచ్చని డీసీపీ శాంభవి మిశ్రా తెలిపారు. గువాహటిలో అక్షయ్ బన్సోడే (32) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. బంగారం అక్రమ రవాణాపై నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో ఈ ఆపరేషన్ చేపట్టాం. 24 క్యారెట్ల బంగారు కడ్డీలతో పాటు దాదాపు 13 గ్రాముల బరువు ఉన్న వెండి ముక్కలు స్వాధీనం చేసుకున్నాం అని ఆమె తెలిపారు. ఈ ముఠాకు అంతర్జాతీయ గోల్డ్ స్మగ్లింగ్ ముఠాతో సంబంధం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదొక భారీ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాకు సంబంధించినదిగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. బన్సోడే గతంలో మూడుసార్లు 20 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలించాడని, తాజాగా నాలుగోసారి తరలిస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు.

# మార్కెట్ యార్డ్ సూపర్‌వైజర్ కమురుద్దీన్ పదవీ విరమణ

- ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట పట్టణ మార్కెట్ యార్డ్ సూపర్‌వైజర్ ఎండీ.కమురుద్దీన్ ఉద్యోగ పదవీ విరమణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమురుద్దీన్‌ను ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. మార్కెట్ యార్డ్ సూపర్‌వైజర్‌గా కమురుద్దీన్ అందించిన సేవలను అభినందించారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత అందరికీ ఆదర్శనీయమన్నారు. సుదీర్ఘ ప్రభుత్వ ఉద్యోగ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆయన.. రిటైర్మెంట్ తర్వాత కూడా నిండు నూరేళ్ల పాటు కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి నరసింహులు, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ఖాదర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజగోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రమేష్ రెడ్డి, కృష్ణ, అంగిరేకుల శివశంకర్, ముక్తార్, వెంకటేష్ యాదవ్, నిరంజన్ గౌడ్, అలాగే మార్కెట్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.